క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన నక్కలపల్లి గ్రామస్తులు



కోటపల్లి: చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌ను హైదరాబాద్‌లో ఆయన నివాసంలో మండలంలోని నక్కలపల్లి సర్పంచ్ తోట స్రవంతి ఆధ్వర్యంలో గ్రామస్తులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. గ్రామ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా త్వరలో పరిష్కరిస్తామని హామీఇచ్చారని వారు తెలిపారు.

లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న లారీడ్రైవర్లు

చెన్నూర్: పట్టణంలోని జాతీయ రహదారిపై చెన్నూర్ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా లారీ డ్రైవర్లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భారతీయ న్యాయసంహిత హిట్, రన్ యాక్ట్ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ నాయకులు ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలని వినతి



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

బెల్లంపల్లి: భీమిని మండలం తంగళ్లపల్లి గ్రామ రైతులు తమ భూముల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణకు వినతిపత్రం అందజేశారు. 2017లో చేపట్టిన భూసర్వే వల్ల తమ గ్రామంలోఉన్న భూముల సమస్యలు పరిష్కారం కాలేదని, మోక సర్వే చేసిన ప్రయోజనం లేకుండా పోయిందని విన్నవించారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌రావు సూచన మేరకు రైతులు ఆర్డీవోను కలిశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రస్తుత భూముల రికార్డులను సమీక్ష చేసి సత్వరం భూముల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీఇచ్చారు. రైతులు ఇందూరి శ్రీనివాస్, నాగేందర్, అన్నం శ్రీనివాస్, తిరుపతి, మల్లేశ్ పాల్గొన్నారు.

ఎస్సార్పీ 3 గనిలో 'ఐఎన్టీయూసీ భరోసా యాత్ర'



కార్మికులతో మాట్లాడుతున్న నాయకులు

శ్రీరాంపూర్: ఎస్సార్పీ3 గనిలో ఐఎన్టీయూసీ నాయకులు భరోసాయాత్ర చేపట్టారు. యూనియన్ బ్రాంచి ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేన శ్యాం గురువారం ఆ గనిని సందర్శించి కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. గర్మికోట్లు సక్రమంగా ఇవ్వడం లేదని, లాకర్స్ మరిన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని వారు హామీ ఇచ్చారు. యూనియన్ జాతీయ సమితి సభ్యులు భీంరావు, నాయకులు భీంరవి, నరసింహారెడ్డి, వీరమల్లు, పెట్టం శ్రీనివాస్, సమ్మిరెడ్డి ఉన్నారు.

అయోధ్య అక్షింతలతో శోభాయాత్ర



శోభాయాత్రలో సర్పంచ్ సత్యం దంపతులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో అయోధ్య శ్రీరామ పూజిత అక్షింతలు గురువారం దొనబండకు చేరుకున్నాయి. అక్షింతలకు స్థానికులు మంగళహారతులతో స్వాగతం పలకగా శోభాయాత్రగా ఇంటింటికీ వెళ్తూ అక్షింతలతోపాటు శ్రీరామ మందిర పటం, కరపత్రాలను అందజేశారు. సర్పంచ్ జాడి సత్యం దంపతులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని కార్మికవాడల్లో అయోధ్య అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. సాయిబాబా ఆలయం నుంచి శోభాయాత్రగా వెళ్లి ఆలయ కమిటీ సభ్యులు ఇంటింటికీ అక్షింతలను అందజేశారు.

ఇంటింటా సం'క్రాంతి'!

మంచిర్యాలఅర్బన్: సంక్రాంతి పెద్ద పండుగ..అంతేగాక సంప్రదాయక పిండి వంటలకు ప్రాధాన్యత ఇస్తుంటారు. ప్రతీ ఇంటా ఘుమఘుమలాడే నోరూరించే రుచులెన్నో. అరిసెలు, సకినాలు, మురుకులు, ఖర్జలు లాంటి పిండివంటలు తయారీలో మహిళలు బిజీబిజీగా ఉన్నారు. ఉద్యోగాలు, పిల్లల చదువులతో తీరికలేని పట్టణవాసులు ఒకచోట చేరి వంటలు చేసుకునేందుకు వీలు చిక్కదు. ఇలాంటి వారికి హోంఫుడ్స్ వరంగా మారాయి. సంక్రాంతి అంటే ముత్యాల ముగ్గులే కాదు నోరూరించే పిండివంటలపై 'సాక్షి'కథనం.

- నోరూరించే పిండివంటలు
- తయారీలో మహిళలు బిజీ
- ఇంట్లో నుంచే విదేశాలకు





గారెలు

సంక్రాంతికి సకినాలు స్పెషల్..

సంక్రాంతి నేపథ్యంలో ఏ ఇంటిలో చూసిన పిండి వంటల తయారీ మరింత సందడిగా ఉంటుంది. తెలంగాణలో సంక్రాంతి పండుగ అనగానే ముందుగా గుర్తొచ్చేది..నోరూరించేంది సకినాలు..గారెలు. కరకరలాడే కారపూస, తియతియ్యని అరిసెలు..ఎన్నో పిండివంటలకు ప్రాధాన్యతనిస్తారు. వారం ముందు నుంచే పిండివంటలు మొదలయ్యాయి. పండుగ వంటలతో ఊరువాడంతా బిజీబిజీగా గడుపుతోంది.


ఇంట్లో నుంచి విదేశాలకు..

మంచిర్యాలలోని హోంఫుడ్ సెంటర్లలో విక్రయించే పిండివంటలు చాలావరకు ఇళ్లలోనే తయారవుతాయి. స్వీట్‌హౌజ్ నిర్వాహకులు తమ గోదాములలో సకినాలు, ఇతర వంటలను భారీగా తయారు చేయిస్తున్నారు. కొందరు మహిళలు ఇంటివద్ద తయారు చేసి హోంఫుడ్ సెంటర్లకు పంపిణీ చేస్తున్నారు. అంతేకాకుండా ఇళ్లలో వీటిని తయారు చేసి కిలో చొప్పున విక్రయిస్తున్నారు.

పండుగ నేపథ్యంలో మంచిర్యాల నుంచి విదేశాలకు పంపిస్తుంటారు. ముందుస్తు ఆర్డర్‌పై చేసిస్తుంటారు. సకినాలు, గారెలు ఏదైనా రూ.350 నుంచి 400 వరకు విక్రయిస్తున్నారు. జన్మభూమినగర్, హైటెక్‌సిటీ కోర్టు ఎదురుగా దుకాణం, ఐబీ ప్రాంతం, కాలేజ్‌రోడ్‌తోపాటు పలు ఇళ్లలో పిండివంటలు తయారు చేసి ఉపాధి పొందుతున్నారు. సంప్రదాయ వంటలు కాబట్టి ఎక్కడ రాజీపడకుండా నాణ్యమైన సరుకులు వాడి పిండివంటల చేస్తామని హోంఫుడ్ సెంటర్ నిర్వాహకురాలు తెలిపారు.



అమెరికాకు పంపించాం



జైపూర్: అఖిల, అక్షయ చదువు కోసం ఏడాది క్రితం అమెరికా వెళ్లారు. సంక్రాంతి ముందుగానే సకినాలు, గారెలు తదితర 9 రకాలు తయారు చేసి కొరియర్‌లో అక్కడికి పంపించాం. – అఖిల, అక్షయతో ఎన్.రమాదేవి

పదిరోజుల ముందే



దండేపల్లి: పది రోజుల ముందే పిండివంటల తయారీ చేస్తాం. సకినాలు, గారెలు, కారపూసలు, అరిసెలు, లడ్డూ తయారీ చేసి మొదలుపెడతాం. ఇంట్లో వీటిని తయారు చేయడంలో ఒకరికి ఒకరం చేదోడు వాదోడుగా ఉంటాం. – రాస అరుణ, దండేపల్లి

ఆర్డర్‌పై పిండివంటలు

సంక్రాంతి వచ్చిందంటే హోంఫుడ్ సకినాలు, గారెలు, అరిసెలకు డిమాండ్ ఉంటుంది. తొమ్మిదేళ్లుగా మంచిర్యాలలో పిండివంటలు తయారు చేసి విక్రయిస్తున్నాం. కుటుంబసభ్యులం పిండివంటల్లో తలమునకలవుతున్నాం. పిండి పట్టించేందుకు ఇంట్లో గిర్నీని ఏర్పాటు చేశాం. విదేశాలకు పంపించే వారు నాలుగురోజుల ముందు ఆర్డర్ ఇస్తే తయారు చేసి ఇస్తుంటాం. – అనసూర్య, హోంఫుడ్ నిర్వాహకురాలు, జన్మభూమినగర్

పిండి వంటలు చేసుకుంటాం



మంచిర్యాలటౌన్: సంక్రాంతికి అన్ని పిండివంటలు చేస్తాం. లడూ చేసుకుని, పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకుంటాం. ఇంటి పక్కన ఉన్న వారంతా కలిసి ఒకే చోట సకినాలు చేయడం చేస్తుంటాం. – బొల్లి లావణ్య, మంచిర్యాల

అందరం కలిసి చేస్తాం



నెన్నెల: కుటుంబమంతా ఒక చోట చేరి పిండి వంటలు తయారీ చేస్తాం. కబుర్లు చెప్పుకుంటూ చేయడంలో ఆ ఆనందమే వేరు. ఇంటికి వచ్చిన అతిథులకు పండుగకు చేసుకున్న పిండివంటలను అందించి ఆత్మీయతను చాటుకుంటాం. – నూతి జ్యోతి, నెన్నెల

పండుగ సంబరం



చెన్నూర్‌రూరల్: సంక్రాంతి వచ్చిందంటే సంబరంగా ఉంటుంది. ఇంటి చుట్టుపక్కల వారంతా కలిసి పిండి వంటలు తయారీ చేస్తాం. వారం నుంచి ఈ పనిలో బిజీగా ఉంటాం. పొద్దున లేవగానే ఇంటి ముందు రంగురంగుల ముగ్గులు వేస్తాం. – గద్దె శ్రీలత, పొక్కూరు

సమన్వయంతో పనిచేయాలి

- విద్యాశాఖ మోడల్ స్కూల్ జేడీ సరోజినీదేవి



ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపాల్, సిబ్బందితో మాట్లాడుతున్న జేడీ

సాక్షి ఎఫెక్ట్..

దండేపల్లి: పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది సమన్వయంతో పనిచేసి విద్యార్థుల ఉత్తమ ఫలితాల సాధనకు కృషిచేయాలని విద్యాశాఖ మోడల్ స్కూల్ జాయింట్ డైరెక్టర్ పి.సరోజినీదేవి అన్నారు. దండేపల్లి మండలం లింగాపూర్ ఆదర్శ పాఠశాలపై సాక్షిలో 'ఆదర్శం..అస్తవ్యస్తం'శీర్షిక గురువారం ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. పాఠశాలను జేడీ సరోజినిదేవి గురువారం సందర్శించారు. ప్రిన్సిపాల్ అనీలా, సిబ్బందితో మాట్లాడారు. సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రిన్సిపాల్ చెప్పినట్లుగా సిబ్బంది వినాలని, లేదంటే ఏమైన సలహాలు, సూచనలు ఉంటే ఆమెతో పంచుకోవాలన్నారు. కాగా, ఉపాధ్యాయుల హాజరుపట్టికలో ఇంకుపడటం గురించి జేడీని సంప్రదించగా, ఇదే విషయమై సిబ్బందిని అడిగితే ఎవరి నుంచి ఎలాంటి సమాధానం రాలేదన్నారు.

తుదిదశకు దరఖాస్తుల ఆన్‌లైన్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ తుదిదశకు చేరుకుంది. గురువారం ఆన్‌లైన్ ప్రక్రియను తహసీల్దార్ సతీశ్‌కుమార్ పరిశీలించారు. హాజీపూర్ మండలంలోని 17 గ్రామాల నుంచి మొత్తం 11,080 దరఖాస్తులు రాగా, ఇందులో ఇప్పటివరకు 10,097 దరఖాస్తులు ఆన్‌లైన్ కాగా, మరో 983 దరఖాస్తులు ఆన్‌లైన్ చేయాల్సి ఉంది. మిగిలిన దరఖాస్తులను శుక్రవారం లోగా ఆన్‌లైన్ పూర్తిచేస్తామని తహసీల్దార్ తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఆన్‌లైన్ ప్రక్రియను ఎంపీడీఓ అబ్దుల్‌హై పర్యవేక్షిస్తున్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

రామకృష్ణాపూర్: గద్దెరాగిడిలోని క్రైస్ట్ స్కూల్‌లో గురువారం ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ మోసాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్లతో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా అసలు సెల్‌ఫోన్లకే పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. పట్టణ ఎస్సై రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో వంద, 7 నుంచి 10వ తరగతుల్లో మిగులు సీట్లలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జయకృష్ణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. జ్టితట//్చ్ఞ్ఛుఽఽ. ఛిజఃఽ జొౌ. జీ వెబ్‌సైట్ ద్వారా ఈనెల 22 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓసీ విద్యార్థులు రూ.200, బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌పీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు రూ.125 చెల్లించాల్సి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఓపెన్ స్కూల్ వరంలాంటిది

దండేపల్లి: వివిధ కారణాలతో మధ్యలో చదువు మానేసిన వారికి ఓపెన్ స్కూల్ ఓ వరం లాంటిదని, దండేపల్లి ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ శంకర్‌గౌడ్, సహాయ కోఆర్డినేటర్ రాజేశ్వర్‌రావు అన్నారు. పాఠశాలలో గురువారం పలువురు ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్ పొందారు. సీఆర్పీ నర్సయ్య పాల్గొన్నారు.

నియామకం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామానికి చెందిన కుర్ర అంజి దళిత వికాస సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జిగా ముల్కల్ల గ్రామానికి చెందిన చెగ్యాము శ్రీనివాస్ నియామకం అయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు కిన్నెర సిద్దార్థ గురువారం ఇరువురికి నియామకపత్రాలు అందజేశారు.

గుండె జబ్బులపై అవగాహన

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓసీపీలో గుండె జబ్బులపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. గురువారం గనిపై జరిగిన కార్యక్రమంలో ఏరియా హెల్త్ ఆఫీసర్ లోక్‌నాథ్‌రెడ్డి మాట్లాడారు. ముందుస్తుగా తీసుకునే జాగ్రత్తలు, ఆరోగ్య అలవాట్లను వివరించారు. ఓసీపీ మేనేజర్ సుదీర్‌జక్కుల, రెస్క్యూ స్టేషన్ ఇన్‌చార్జి రాంమోహన్, ఏఐటీయూసీ నాయకులు బాజీసైదా, మోహన్‌రెడ్డి, సంక్షేమ అధికారి బొంగోని శంకర్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో సంక్రాంతి సంబురాలు



మంచిర్యాలఅర్బన్: అల్ఫోర్స్ పాఠశాలల్లో..



శ్రీ చైతన్య పాఠశాలలో చిన్నారుల వేషధారణ

మంచిర్యాలఅర్బన్/బెల్లంపల్లి/జన్నారం/కోటపల్లి/భీమిని/చెన్నూర్‌రూరల్/భీమారం/నెన్నెల/మంచిర్యాలరూరల్: జిల్లాలో పలు విద్యాసంస్థల్లో గురువారం ముందస్తు సంక్రాంతి సంబురాలు జరుపుకొన్నారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి అందమైన రంగవల్లులు వేసి ఆకట్టుకున్నారు. మంచిర్యాలలోని శ్రీ చైతన్య పాఠశాలల్లో బోగిమంటలు, బసవన్నలు, హరిదాసులు, వరినాట్లు, వివిధ రకాల ముగ్గులు అలరించాయి. అల్ఫోర్స్ పాఠశాలలో మకర సంక్రాంతి ఉత్సవ్ వేడుకలు నిర్వహించారు. ఆర్‌బీహెచ్‌వీ, బెల్లంపల్లిలోని శాంతిఖని బస్తీ జెడ్పీఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మంచిర్యాలలోని అభ్యాస, జన్నారంలోని వివేకానంద పాఠశాలల్లో చిన్నారుల వేషధారణలు చూపరులను ఆకట్టుకున్నాయి. కోటపల్లి మండలంలోని బమన్‌పల్లి, మోడల్ స్కూల్, చెన్నూర్ మండలంలోని సుద్దాల, నెన్నెలలో లోటస్ స్కూల్ ప్రాంగణంలో, భీమిని, కన్నెపల్లి మండలాల్లో, హాజీపూర్ మండలం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని ముగ్గులు వేశారు. గెలుపొందినవారికి బహుమతులు అందజేశారు. భీమారంలోని జెడ్పీ ఉన్నతపాఠశాలలో ముగ్గుల పోటీల్లో పాల్గొని గెలుపొందిన విజేతలకు విప్రో ఏజెన్సీ డిస్ట్రీబ్యూటర్ రియాజొద్దీన్ బహుమతులు అందించారు. హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జన్నారం: హరిదాసు వేషధారణలో వివేకానంద విద్యార్థులు

అక్రమాలకు పాల్పడితే చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న అదనపు డీఆర్డీడీవో

లక్సెట్టిపేట: ఉపాధిహామీ పనుల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు డీఆర్డీడీవో దత్తాత్రి హెచ్చరిమచారు. ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఎంపీపీ అన్నం మంగ అధ్యక్షతన గురువారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధి పనులు నిర్వహించే ప్రదేశాల్లో కూలీలకు సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ సందర్భంగా 2020–23 ఆర్థిక సంవత్సరం వరకు నిర్వహించిన పనులపై తనిఖీ చేపట్టారు. ఫీల్డ్‌స్థాయిలో ఉన్న సిబ్బందికి సలహాలు సూచనలు చేశారు. కొన్ని గ్రామాల్లోని పనుల్లో కొలతలు తేడా రావడంతో తనిఖీలో బయటపడ్డ రూ.35,513లను రికవరీ చేసేందుకు ఆదేశించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్తె సత్తయ్య, విజిలెన్స్ అధికారులు సురేష్, కిరణ్, శివరాం, ఎస్‌టీఎం నరేందర్, ఎస్‌ఆర్పీ సాయిలు, ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి, ఏపీవో వెంకటరమణ, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఒత్తిడికి దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ రవి వర్మ

బెల్లంపల్లి: విద్యార్థులు ఒత్తిడికి దూరంగా ఉండాలని ప్రముఖ సైకియాటిస్ట్ డాక్టర్ రవివర్మ అన్నారు. బెల్లంపల్లి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మేము సైతం ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ యూత్ వెల్ఫేర్ సొసైటీ, మంచిర్యాల మైండ్ మ్యాటర్స్ న్యూరో సైకియాట్రీ సెంటర్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం రవివర్మ మాట్లాడుతూ ఒత్తిడిని తగ్గించుకోవడానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. జ్ఞాపకశక్తి పెంచుకోవడానికి అనుసరించే పద్ధతులను వివరించారు. డాక్టర్ సాయిలక్ష్మి, కళాశాల ప్రిన్సిపాల్ అంజయ్య, మేము సైతం ఎన్‌జీవో వ్యవస్థాపకుడు, ప్రధాన కార్యదర్శి రంగ ప్రశాంత్, బోగే సత్యం పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

శ్రీరాంపూర్: సింగరేణి కంపెనీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఏరియా జీఎం బి.సంజీవరెడ్డి ఆవిష్కరించారు. జీఎం కార్యాలయం వద్ద గురువారం ఆవిష్కరించారు. ఎస్‌ఓటూజీఎం రఘుకుమార్, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, డీజీఎం(ఐఈడీ) చిరంజీవులు, ఎస్టేట్స్ అధికారి వరలక్ష్మి, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్‌రరెడ్డి, డీవైపీఎంలు పాల్గొన్నారు.

భీమిని: స్థానిక జెడ్పీఉన్నత పాఠశాలలో గురువారం టీపీయూఎస్ క్యాలెండర్‌ను జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీధర్, మండల అధ్యక్షుడు తిరుపతి ఆవిష్కరించారు. వరప్రసాద్, జీవన్, చంద్రశేఖర్ తిరుపతి, విక్రమ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భీమారం: మండల కేంద్రంలో తపస్ ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను మండల ప్రధాన కార్యదర్శి సంతోష్ ఆవిష్కరించారు.

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియా జీఎం ఆఫీస్ ఆవరణలో జీఎం మనోహర్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఎస్వోటూ జీఎం రాజేశ్వరరెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్ ఉన్నారు.

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని వికాసతరంగిణి జెట్ భవన్‌లో వనితా వాక్కు ఫౌండేషన్ క్యాలెండర్‌ను వికాస తరంగిణి సభ్యులు ఆవిష్కరించారు. వివేకవర్ధిని డైరెక్టర్ చంద్రమోహన్ గౌడ్, వనితా వాక్కు కోఫౌండర్స్ కవిత, సునీత కుర్మ, గౌరవ అధ్యక్షులు జ్యోత్స్న, అడ్వైజరీ కమిటీ వైస్ చైర్మన్ అన్నపూర్ణ, జనరల్ సెక్రటరీ మంజుల, వైస్ ప్రెసిడెంట్ మంజు భాషిణి, హిందూ సేవక్ సమాజ్ సభ్యులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

మంచిర్యాలటౌన్: ఈనెల 12న స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఫర్ బ్లడ్ డొనేషన్ క్యాంప్స్ వి. మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో గురువారం స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. హాల్‌ఫుల్ నెస్ సంస్థ ద్వారా విద్యార్థులకు శారీరక వ్యాయామంతోపాటు, మానసిక ప్రవర్తన, యోగా, ధ్యానం అలవర్చుకునేలా డాక్టర్ సూర్యనారాయణ, సతీశ్, పవన్, కళ్యాణ్‌లు ప్రగతి కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం నిర్వహించిన శిబిరంలో పలువురు రక్తదానం చేశారు. డాక్టర్ కె.సుగుణాకర్‌రెడ్డి, బాలాజీ, వెంకటేశ్వర్లు, రాకేశ్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, కె.భాస్కర్ రెడ్డి, చందూరి మహేందర్, కాసర్ల శ్రీనివాస్, బ్లడ్ బ్యాంక్ సూపర్‌వైజర్ కె.మాదవి, వేణు, ప్రేమ్‌కుమార్‌సింగ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

నస్పూర్: పట్టణంలోని అన్ని వార్డుల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ రామ్మూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. మంచిర్యాలలోని 33 కేవీ లైన్‌వర్క్ కారణంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

ఉత్సాహంగా కైట్ ఫెస్టివల్

రామకృష్ణాపూర్: పట్టణంలోని సెయింట్ జాన్స్ హైస్కూల్‌లో గురువారం కైట్ ఫెస్టివల్‌ను నిర్వహించారు. సంక్రాంతి పురస్కరించుకుని విద్యార్థులు పతంగులను ఎగురవేశారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

భీమిని: కన్నెపల్లి మండలంలోని లింగాల, చింతపుడి గ్రామాల్లో ఆర్థిక అక్షరాస్యతపై వేమనపల్లి టీజీబీ అధికారులు అవగాహన కల్పించారు. పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై, ఏపీవై పాలసీలు, బ్యాంక్ రుణాల మంజూరు గురించి వివరించారు. మేనేజర్ చరణ్‌కుమార్, క్యాషియర్ వినయ్ ఉన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

చెన్నూర్: పట్టణంలోని కొటబొగుడ మైదానంలో గత నాలుగు రోజులుగా నిర్వహించిన వీరమల్ల మురళీమోహన్ స్మారక చెన్నూర్ మున్సిపల్ స్థాయి క్రికెట్ పోటీలు గురువారంతో ముగిశాయి. పోటీల్లో 20 జట్లు పాల్గొనగా, రుద్ర ఎలెవన్, రుద్ర జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. ఫైనల్ రుద్ర జట్టు విజేతగా నిలిచింది. మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్ జ్ఞాపిక అందజేశారు. బీఆర్‌ఎస్ నాయకులు రాంలాల్‌గిల్డా, వీరమల్ల రాంమోహన్ పాల్గొన్నారు.

ఆంజనేయులు మృతికి నివాళి

మందమర్రిరూరల్: పట్టణంలోని పాత బస్టాండ్ ప్రొఫెసర్ జయశంకర్ కూడలి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కుంచాల అంజనేయులు మృతి చెందారు. పట్టణంలోని సింగరేణి హైస్కూల్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు మైదాన ప్రాంగణంలో గురువారం రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు.

వైద్యశిబిరం

వేమనపల్లి: మండలంలోని ముక్కిడిగూడంలో వైద్యాధికారి రాజేష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. అనంతరం రోగులను పరీక్షించి మందులు అందజేశారు. సీహెచ్‌ఓ రాజిరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ లింగయ్య, ఏఎన్‌ఎం రాజేశ్వరి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మధ్యాహ్నభోజన ప్లేట్లు పంపిణీ

జైపూర్: చదువును మించిన ఆస్తిలేదని చదువుతోనే ఉన్నత స్థానంలో ఉంటామని మహిళా తరంగిణి(మమత) సంస్థ అధ్యక్షురాలు శ్రీదేవి తెలిపారు. మండలంలోని ముదిగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సంస్థ ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్న భోజన ప్లేట్లు అందజేశారు. హెచ్‌ఎం రాజగోపాల్, సభ్యులు పద్మారెడ్డి, సర్పంచ్ జ్యోతి, ఎస్‌ఎంసీ చైర్మన్ భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.